సాక్షి
మెదక్
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



పాంచ్ పటాకా

మరో ఐదు రోజులు మాత్రమే మంచి ముహూర్తాలు ఉండడంతో ఎక్కడ చూసినా పెళ్లి సందడి నెలకొంది.

వివరాలు 8లో ▸



బాలలు.. కరాటే వీరులు

స్వీయ రక్షణ కోసం కరాటేపై మక్కువ చూపుతున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలకు కరాటే నేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

వివరాలు 8లో ▸



మార్కెట్ పీఠం ఎవరికో..?

తూప్రాన్ మార్కెట్ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఆరోగ్య మిత్రల సమ్మె బాట



మెదక్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఆరోగ్య మిత్రలు

రామాయంపేట(మెదక్): తమ సమస్యల సాధన కోసం ఆరోగ్య మిత్రలు మంగళవారం నుంచి సమ్మెబాట పట్టనున్నారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఆరోగ్య ట్రస్ట్ అధికారులు, ఎమ్మెల్యేలకు నోటీసులు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 43 మంది ఆరోగ్య మిత్రలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులకు వచ్చే రోగుల వివరాలు నమోదు చేస్తుంటారు. ఇదే విషయమై ఆరోగ్య మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ.. తమ సమస్యల సాధన విషయమై ప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 16 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేదని, నామమాత్రపు వేతనాలతో పనిచేస్తున్నామని వాపోయారు. విధి నిర్వహణలో ఎవరైనా మిత్రలు మృతిచెందితే రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ ఫిర్యాదులు స్వీకరించాలి: డీఏఓ

మెదక్ కలెక్టరేట్: రుణమాఫీపై రైతుల విజ్ఞప్తులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీఏఓ గోవింద్ మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. నేటి నుంచి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. వివిధ కారణాలతో రుణమాఫీ జరగని రైతులు ఇచ్చే ఫిర్యాదులను స్వీకరించి, ఏ కారణం చేత మాఫీ జరగలేదో వివరించాలని సూచించారు. ఇంకా రుణమాఫీ సైట్ రానందున అప్పటివరకు ఆధార్ కార్డు వివరాలు, పట్టాదారు పాస్ పుస్తకం సేకరించి ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

దుర్గమ్మకు పల్లకీ సేవ



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గా మాత సన్నిధిలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకొని పల్లకీ సేవ నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి రాజగోపురం మీదుగా ఊరేగింపు కొనసాగించారు. కార్యక్రమంలో ఈఓ కృష్ణప్రసాద్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు రాఖీ కట్టిన పద్మ



మెదక్ మున్సిపాలిటీ: రాఖీ పౌర్ణమిని జిల్లా కేంద్రంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దూర ప్రాంతాల నుంచి సోదరులకు రాఖీలు కట్టేందుకు ఆడపడుచులు వచ్చారు. దీంతో పట్టణంలోని రాఖీ సెంటర్లు, స్వీట్ షాపులు, బస్టాండ్ మహిళలతో కిటకిటలాడాయి. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్ సమీయొద్దీన్ రాఖీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



కలెక్టర్‌కు రాఖీలు కడుతున్న బాల సదనం చిన్నారులు

కలెక్టర్‌కు ఆత్మీయతతో..

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని బాల సదనం చిన్నారులు కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ వారిని ఆశీర్వదించారు. అనంతరం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారిణి బ్రహ్మాజీ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి సైతం కలెక్టర్‌కు రాఖీ కట్టారు. – మెదక్ కలెక్టరేట్



నర్సాపూర్ నుంచి జోగిపేట వెళ్లే బస్సులో ప్రయాణికుల రద్దీ

ఆర్టీసీకి గి‘రాఖీ’..

ఆర్టీసీ బస్టాండ్ సోమవారం ప్రయాణికులతో కిక్కిరిసింది. తమ సోదరులకు రాఖీ కట్టేందుకు మహిళలు పెద్ద ఎత్తున బస్సుల్లో వెళ్లారు. ప్రధానంగా బాలానగర్, జోగిపేట, తూప్రాన్, సంగారెడ్డి మార్గాల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కన్పించింది. పలు మార్గాల్లో ప్రత్యేక బస్సులు నడిపినా నిరీక్షించాల్సి వచ్చింది. – నర్సాపూర్

నిధుల కొరత.. తప్పని వెత

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ సమస్యలతో సతమతం అవుతోంది. నిధుల కొరతతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

అధ్వానంగా రోడ్లు, మురుగు కాల్వలు

పట్టణంలోని అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు పాక్షికంగా శిథిలమై పట్టణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ వద్ద నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు 20 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారింది. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ. 25 కోట్లతో పాటు ఇతర నిధులు విడుదల కాకపోవడంతో పనులు మొత్తం పెండింగ్‌లో పడ్డాయి.

రామాయంపేట మున్సిపాలిటీలో కానరాని ప్రగతి



రామాయంపేట పట్టణ వ్యూ

అసంపూర్తిగా డంప్‌యార్డు నిర్మాణం



డంప్‌యార్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో చెత్తా చెదారాన్ని ఎక్కలదేవుని బండ పైభాగంలో వేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో రోజూ రెండు ట్రాక్టర్లు, మూడు ఆటోల్లో చెత్తను సేకరిస్తున్నారు. ప్రతిరోజూ కనీసం కనీసం తొమ్మిది మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుండగా, దీనిని ఆరుబయట వేస్తున్నారు. గుట్టపై ప్రాంతం కలుషితమై దోమలు, ఈగలతో దుర్వాసన వెదజల్లుతోంది. తడి, పొడి చెత్త వేరు చేయడం కోసం నిర్మించిన షెడ్ నిరుపయోగంగా మారింది.

కలుషితమైన మల్లె చెరువు



పట్టణంలోని కొన్ని వార్డులకు సంబంధించి మురుగు నీటిని సిద్దిపేట రూట్‌లో ఉన్న మల్లె చెరువులోకి వదులుతున్నారు. దీంతో చెరువు నీరు మొత్తం కలుషితమైంది. మురుగు నీటిని ఇతర ప్రాంతాలకు తరలించాలనే పట్టణవాసుల డిమాండ్ ఇప్పటివరకు నెరవేరలేదు. మురుగు నీటితో దుర్వాసన వెదజల్లుతుండగా, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నీటి కలుషితంతో గతంలో చెరువులో వదిలిన చేపలు సైతం మృత్యువాత పడ్డాయి.

నిధులు మంజూరు కాగానే..



నిధులు మంజూరు కాకపోవడంతో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నాం. డంప్‌యార్డు వద్దకు వెళ్లడానికి రోడ్డు సదుపాయం సరిగా లేదు. దీంతో చెత్త వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా చేయడానికి ప్రయత్నిస్తున్నాం. డంప్‌యార్డు పూర్తి కాకపోవడంతో చెత్తను ఆరు బయటే వేయాల్సి వస్తోంది. మల్లె చెరువులోకి మురుగు నీరు వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.

– దేవేందర్, మున్సిపల్ కమిషనర్

రూ.3 కోట్ల టోకరా

- రైతులకు 'గాయత్రీ' కుచ్చుటోపీ
- వారి పేర్లపై బ్యాంకులో రుణాలు
- చెరకు అగ్రిమెంట్ కోసం పాస్ పుస్తకాల స్వీకరణ
- రుణమాఫీ కాకపోవడంతో బట్టబయలు



మెదక్‌జోన్: రైతులకు గాయత్రీ ఫ్యాక్టరీ యాజమాన్యం కుచ్చుటోపి పెట్టింది. సాగు చేసిన చెరకును తమ ఫ్యాక్టరీకి మాత్రమే పంపాలని అగ్రిమెంట్ చేసుకుంటున్నామని నమ్మించి వారి నుంచి పట్టాదార్ పాస్ పుస్తకాలతో పాటు ఆధార్ కార్డుల జిరాక్స్ ప్రతులను స్వీకరించారు. వాటిని బ్యాంకులో పెట్టి సుమారు రూ. 3 కోట్ల పంట రుణాలు తీసుకున్నారు. ఇటీవల జరిగిన రుణమాఫీలో సదరు రైతులకు మాఫీ వర్తించకపోవడంతో అసలు విషయం బయట పడింది.

జిల్లాలో 250 మంది రైతులు

మెదక్ జిల్లాలోని మెదక్, హవేళిఘనాపూర్ మండలాల్లో సుమారు 250 మంది రైతులు చెరకు సాగు చేస్తారు. వీరంతా ఏటా చెరకు పంటను కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీకి తరలిస్తారు. కాగా రెండేళ్ల క్రితం వీరు సాగు చేసిన చెరకును తమ ఫ్యాక్టరీకి మాత్రమే పంపుతున్నట్లు అగ్రిమెంట్ చేసుకుంటామని.. అందుకు ఆధార్ జిరాక్స్‌తో పాటు పట్టాదారు పాస్‌బుక్, ఫొటో ఇవ్వాలని ఫ్యాక్టరీ యాజమాన్యం కోరింది. నమ్మిన రైతులు అడిగిన ప్రతాల జిరాక్స్ ఇచ్చారు. దీంతో సదరు ఫ్యాక్టరీ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా ఆ పత్రాలను నిజామాబాద్‌లోని యూనియన్ బ్యాంకులో పెట్టి సుమారు రూ.3 కోట్ల పంట రుణం తీసుకున్నారు. అప్పటికే ఆ రైతులు స్థానికంగా ఉన్న బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. కాగా ఇటీవల ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో ఈ రైతులకు మాఫీ వర్తించలేదు. కారణం తెలుసుకునేందుకు రైతులు స్థానిక వ్యవసాయ అధికారిని సంప్రదించగా రుణమాఫీ పోర్టల్‌లో రూ. 2 లక్షలకు పైగా రుణం ఉందని చూపించింది. దీంతో రైతులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు.

బ్యాంకర్లు ఎలా ఇస్తారు..?

గ్రామ పరిధిలోని బ్యాంకులో మాత్రమే రైతులకు పంట రుణాలు ఇస్తారు. కానీ జిల్లా కాని జిల్లాలో రైతుల ముఖం చూడకుండా, కనీసం ఒరిజినల్ పట్టాదారు, ఆధార్‌కార్డులు చూడకుండా జిరాక్స్ పేపర్లతో రుణం ఎలా మంజూరు చేస్తారని రైతులు వాపోతున్నారు. ఫ్యాక్టరీ యజమానితో కుమ్మక్కైన బ్యాంకర్లు రుణాలు ఇచ్చి తమను మోసం చేశారని మండిపడ్డారు. సదరు ఫ్యాక్టరీ యజమానితో పాటు తమ ప్రమేయం లేకుండా రుణాలు ఇచ్చిన బ్యాంకర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఈ విషయమై ఫ్యాక్టరీ యజమానిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను చాలా కాలంగా చెరకు సాగు చేసి కామారెడ్డి జిల్లా గాయత్రీ ఫ్యాక్టరీకి తరలిస్తున్నా. రెండేళ్ల క్రితం పట్టాదార్ పాస్ బుక్‌తో పాటు ఆధార్‌కార్డు అడిగితే ఇచ్చాను. స్థానికంగా భూర్గుపల్లిలోని ఎస్‌బీఐలో రూ.1.80 లక్షల పంట రుణం తీసుకున్నాను. అది కాకుండా నిజామాబాద్ యూనియన్ బ్యాంకులో రూ. 21,800 అప్పు తీసుకున్నట్లు మెసేజ్ వచ్చింది. వడ్డీతో రూ. 28 వేలు అయింది. రూ. 2 లక్షలకు పైగా రుణం ఉండడంతో రుణమాఫీ కాలేదు. ప్రభుత్వం న్యాయం చేయాలి.

– గోపాల్, బాధిత రైతు
రాజిపేట తండా

సత్వర పరిష్కారం చూపండి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ప్రజావాణికి 63 వినతులు

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణి వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే అర్జీలను పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. పరిష్కరించేందుకు వీలులేని పక్షంలో తదుపరి చర్యల కోసం వారికి సూచనలు అందించాలన్నారు. ప్రజావాణికి మొత్తం 63 అర్జీలు రాగా రుణమాఫీపై 22, ధరణిపై 19, పెన్షన్ల కోసం 4, ఇతర సమస్యలపై 22 వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- తమ తండాకు రోడ్డు లేక అవస్థలు పడుతున్నామని నర్సాపూర్ మండలం అహ్మద్‌నగర్ పంచాయతీ జెట్టి పోచమ్మ తండా గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.
- రుణమాఫీ చేశామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ బ్యాంకు, వ్యవసాయ అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పడం లేదని మెదక్ మండలం గుట్టగిందిపల్లి, హవేళీఘనపూర్ మండలం రాజిపేట, కొత్తపల్లి గ్రామ ఫిర్యాదు చేశారు.
- తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వడం లేదని మెదక్ మండలం గంగాపూర్ రైతులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం మండలంలోని తునికి వద్ద గల ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను భోజనంతో పాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాఖీ సందర్భంగా పాఠశాలకు వచ్చిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలపై వైద్యులతో రెగ్యులర్ హెల్త్ చెకప్ చేయించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11 మంది తహసీల్దార్ల బదిలీ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని 11 మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్ నర్సాపూర్‌కు బదిలీ కాగా, నర్సాపూర్ తహసీల్దార్ కమలాద్రి శివ్వంపేటకు, పాపన్నపేట తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు మెదక్‌కు, అల్లాదుర్గం తహసీల్దార్ సతీష్‌కుమార్ పాపన్నపేటకు, మెదక్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్ హవేళీఘనాపూర్‌కు, అక్కడి తహసీల్దార్ నారాయణ చేగుంటకు బదిలీ అయ్యారు. మెదక్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ మల్లయ్య అల్లాదుర్గంకు, శివ్వంపేట తహసీల్దార్ శ్రీనివాస్‌చారి మెదక్ కలెక్టరేట్‌కు, టేక్మాల్ తహసీల్దార్ కృష్ణ వెల్దుర్తికి, చేగుంట తహసీల్దార్ గౌసున్నీషా మెదక్ కలెక్టరేట్‌కు, వెల్దుర్తి తహసీల్దార్ తులసీరాం టేక్మాల్‌కు బదిలీ అయ్యారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

నేటి నుంచి బీఎల్‌ఓల ఇంటింటి సర్వే

మెదక్ కలెక్టరేట్: ఓటు నమోదుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. నేటి నుంచి జిల్లాలో ఆర్డీఓల ఆధ్వర్యంలో నూతన ఓటరు నమోదు చేపట్టనున్నారు. జిల్లాలోని అన్ని బూత్‌లలో ఎంఎల్‌టీలు, బీఎల్‌ఓలు సంబంధిత అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదు చేయనున్నారు. ఇదే విషయమై ఈనెల 17న కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎస్‌ఎస్‌ఆర్– 2025లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, చిరునామాల మార్పు, చేర్పుల్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని సూచించారు.

అధికారులకు శిక్షణ

జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఎంఎల్‌టీలు, బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు నమోదు ప్రక్రియ నిర్వహిస్తారు. ఇందుకోసం ఆర్డీఓ రమాదేవి సోమవారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలాల వారీగా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించి ఓటరు లిస్టులో పేర్ల నమోదు, వాటిలో మార్పులు, చేర్పులను చేయాల్సి ఉంటే పక్కాగా నిర్వహించాలని వివరించారు. అలాగే గ్రామాలు, వార్డుల్లో సంబంధిత అధికారులు పర్యవేక్షించే సమయంలో ఆయా చోట్ల చనిపోయిన ఓటర్లను గుర్తించి వారి వివరాలను ఓటరు జాబితా నుంచి తొలగించాలని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను తొలగించే ముందు వారి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చి, వారం రోజుల గడువు తర్వాత పేర్లను తొలగించాలని, జాబితాలో ఫొటో తప్పుగా నమోదు అయిన వాటిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఓటరు నమోదుపై ఎంఎల్‌టీలకు శిక్షణ ఇస్తున్న ఆర్డీఓ రమాదేవి

జిల్లాలో 4,45,823 మంది ఓటర్లు

జిల్లాలో ప్రస్తుతం 4,45,823 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మెదక్ నియోజకవర్గంలో 2,18,735, నర్సాపూర్ నియోజకవర్గంలో 2,27,088 మంది ఉన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుకు విస్తృతస్థాయి ప్రచారం కల్పించనున్నారు. ఇందులో భాగంగా కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలోని యువతీ, యువకులు ఇంటింటికీ వచ్చే అధికారుల వద్ద నూతన ఓటరు నమోదు చేసుకోవాలి. లేదా బూత్‌ల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఆన్‌లైన్ ద్వారా కూడా ఓటరు నమోదు చేసుకోవచ్చు. త్వరలో జరుగనున్న పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో నూతన ఓటరు నమోదు చేపడుతున్నారు.



ఆర్డర్ కాపీలు అందజేస్తున్న ఏడీఈలు

విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతి

మెదక్ కలెక్టరేట్: మెదక్ విద్యుత్ డివిజన్‌లో 53 మంది జూనియర్ లైన్‌మెన్లకు అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ప్రమోషన్ వచ్చినట్లు డివిజనల్ ఇంజినీరింగ్ అధికారి కృష్ణారావు తెలిపారు. సోమవారం మెదక్ డివిజనల్ కార్యాలయంలో ప్రమోషన్ పొందిన లైన్‌మెన్లకు ఏడీఈలు మోహన్‌బాబు, భాస్కర్‌రెడ్డితో కలిసి ఆర్డర్ కాపీలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం యూనియన్ తరపున డివిజన్ సెక్రటరీ అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎనిమిది గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

దుబ్బాకటౌన్‌: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన దౌల్తాబాద్‌ మండలం దొమ్మాట గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన అక్కమొల్ల నర్సింలు రోజూ మాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకెళ్లి చీకటి పడగానే ఇంటి ఎదుట పాకలో తోలాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌ షాక్‌ తగిలి ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు నర్సింలు వేడుకున్నాడు.

కడుపునొప్పితో ఒకరు.. అప్పుల బాధతో మరొకరు

– వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

పటాన్‌చెరుటౌన్‌: కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అంబరయ్య కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం చిట్కుల్‌ గ్రామానికి చెందిన బాబు చారి(40) ఓ ప్రైవేట్‌ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ మాత్రలు వాడుతున్నాడు. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా చిట్కుల్‌ గ్రామ పరిధిలోని చెరువులో ఆదివారం మృతదేహం కనిపించింది. తన భర్త కడుపునొప్పితో బాధపడుతున్నాడని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చనిపోతున్నానని సోదరికి ఫోన్‌ చేసి..

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ గ్రామం వీకర్‌ సెక్షన్‌ కాలనీకి చెందిన మల్లేశం(39) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆరు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో కుడి కాలు విరిగి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో రూ.4 నుంచి రూ.5 లక్షల వరకు అప్పులయ్యాయి. ఆదివారం ఉరి వేసుకునే ముందు సోదరికి ఫోన్‌ ద్వారా తాను ఆత్మహత్య చేసుకుంటానని తెలిపాడు. ఆమె వెంటనే వదిన నాగమణికి ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వగా అప్పటికే మల్లేశం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గడ్డి మందు తాగి ఒగ్గు పూజారి ..

దుబ్బాక: పురుగు మందు తాగి ఒగ్గు పూజారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన పయ్యావుల బుజ్జమ్మ పెద్దకుమారుడు మధుకర్‌(36) మల్లన్న ఆలయంలో ఒగ్గు పూజారిగా పని చేస్తున్నాడు. కొద్ది రోజులుగా అతడికి మానసిక పరిస్థితి సరిగ్గా లేదు. 16వ తేదీన సాయంత్రం గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడగా గమనించిన కుటుంబీకులు మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తల్లి బుజ్జమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

కొండపాక(గజ్వేల్‌): లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పలువురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలంలోని దుద్దెడ శివారులోని నాగులబండ వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగిత్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో దుద్దెడ శివారులోకి వెళ్లగానే వర్షం ప్రారంభమైంది. ముందు వెళ్తున్న లారీ సడన్‌గా బ్రేక్‌ వేయడంతో ఆర్టీసీ బస్సు లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, సుమారు 15 మంది ప్రయాణీకులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

క్యాషియర్‌పై దాడి

– డబ్బుల విషయంలో అవకతవకలు

పటాన్‌చెరు టౌన్‌: మద్యం దుకాణంలోని డబ్బుల విషయంలో తేడాలు వచ్చాయని క్యాషియర్‌పై యాజమాన్యం దాడి చేసిన ఘటన జిన్నారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని సోలక్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. సోలక్‌పల్లి గ్రామంలోని వజ్ర మద్యం దుకాణంలో సురేశ్‌ అనే వ్యక్తి క్యాష్‌ కౌంటర్‌గా పని చేస్తున్నాడు. డబ్బుల విషయంలో అవకతవకలు జరిగాయని యాజమాన్యం పిలిపించి దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో రూ.8 లక్షలు తాను వాడుకున్నట్లు ఒప్పుకున్నాడు. యాజమాన్యం మాత్రం రూ.40 లక్షలు అవకతవకలు జరిగాయని సురేశ్‌ను దబాయించారు. విషయం తెలుసుకున్న బాధితుడు భార్య పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. తనపై దాడి చేసిన వైన్స్‌ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సురేశ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పాంచ్‌ పటాకా



సరిగ్గా మూడు నెలల విరామం తర్వాత శ్రావణమాసంలో జోరుగా పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఈ నెలాఖరుకు వరకు మాత్రమే ముహూర్తాలు ఉండడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బాజాభజంత్రీలు మోగనున్నాయి. తర్వాత మరో 63 రోజులపాటు బ్రేక్‌ పడనుంది. శ్రావణమాసంలో 17 రోజులపాటు మంచి ముహూర్తాలు ఉండడంతో జోరుగా వివాహాలు, కొత్తగా నిర్మించుకున్న ఇళ్లలో (గృహ ప్రవేశాలు), కొత్త ఇళ్ల నిర్మాణాలకు ముహూర్తాలతోపాటు పలు శుభకార్యాలు జరిగాయి. తాజాగా మరో ఐదు రోజులు మాత్రమే మంచి ముహూర్తాలు ఉండటంతో ఎక్కడ చూసినా పెళ్లి శోభ సంతరించుకుంది. – దుబ్బాక



మరో 5 రోజులే మంచి ముహూర్తాలు

- ఉమ్మడి మెదక్‌ జిల్లాకు సంతరించుకున్న పెళ్లి శోభ
- 40 వేలకు పైగా జరగనున్న వివాహాలు
- మళ్లీ 2 నెలలు శుభకార్యాలకు బ్రేక్‌
- ఫంక్షన్‌ హాల్స్‌, టెంట్‌ హౌస్‌లు, బ్యాండ్‌ మేళాలకు డిమాండ్‌

శ్రావణ మాసంలో ఇప్పటికే చాలా పెళ్లిళ్లు జరిగాయి. ఇక మిగిలింది 22, 23, 28, 30, 31 తేదీలు మాత్రమే కావడంతో ఉమ్మడి మెదక్‌ జిల్లాలో సుమారుగా 40 వేలకు పైగా వివాహాలు జరుగనున్నాయి. సిద్దిపేటలో 14 వేలు, సంగారెడ్డి జిల్లాలో 16 వేలు, మెదక్‌లో 12 వేలకు పైగా పెళ్లిళ్లు జరగనున్నాయని వేదపండితులు తెలిపారు. ఈ క్రమంలో ఫంక్షన్‌ హాల్స్‌కు భలే డిమాండ్‌ నెలకొంది. రెండు నెలల ముందుగానే ఫంక్షన్‌ హాల్స్‌ బుక్‌ చేసుకోవడం విశేషం. ఉమ్మడి మెదక్‌ జిల్లాలో ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాల్స్‌ 3,500 కు పైగా ఉండగా ప్రభుత్వ (టీటీడీ), కమ్యూనిటీ హాల్స్‌ మరో 5,000కు పైగా ఉన్నాయి.

బ్యాండ్‌ మేళాలు, టెంట్‌హౌస్‌లు బిజీ

రానున్న ఐదు రోజుల్లో పంతుళ్లు, బ్యాండ్‌ మేళాలు, టెంట్‌ హౌస్‌లు, డెకరేషన్‌, ఫొటో, వీడియోగ్రాఫర్లకు డిమాండ్‌ ఏర్పడింది. ముహూర్తాలను దృష్టిలో పెట్టుకొని చాలా మంది ముందుగానే అడ్వాన్స్‌ ఇచ్చుకున్నారు. ఇక పంతుళ్లు సైతం గ్రామాలు, పట్టణాల్లో ఎక్కువగా పెళ్లిళ్లు పెట్టడడంతో ఇతర గ్రామాల్లోని బంధువులను పెళ్లిళ్లు చేయడానికి రప్పించుకుంటున్నారు.

మళ్లీ రెండు నెలలు బ్రేక్‌

సెప్టెంబర్‌ 1 నుంచి నవంబర్‌ 3 వరకు మంచి ముహూర్తాలు లేకపోవడంతో శుభకార్యాలకు 63 రోజులపాటు బ్రేక్‌ పడనుంది. చాలా రోజులపాటు మంచి రోజులు లేకపోవడంతో శ్రావణంలో సుమారుగా 17 ముహూర్తాలు ఉండగా జోరుగా వివాహాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు జోరుగా జరిగాయి. తాజాగా నవంబర్‌ 3 వరకు ముహూర్తాలు లేకపోవడంతో అంత వరకు ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

40 వేలకు పైగా పెళ్లిళ్లు



శ్రావణమాసంలో శుభకార్యాలకు ముహూర్తాలు ముగుస్తున్నాయి. మళ్లీ నవంబర్‌ వరకు ఆగాల్సిందే. ఈ నెలలో ఐదు రోజులే ఉమ్మడి మెదక్‌ జిల్లాలో సుమారుగా 40 వేల వరకు వివాహాలు జరుగనున్నాయి. నేనే వందకు పైగా వివాహాలకు ముహూర్తాలు నిర్ణయించాను. మూడు నెలల విరామం తర్వాత ఈ శ్రావణమాసంలో సైతం కొన్ని ముహూర్తాలు మాత్రమే ఉండడంతో ఉన్న కొద్ది ముహూర్తాల్లో వేల కొత్త జంటలు వివాహంతో ఒక్కటవుతున్నాయి.

–ఎం.ఎస్‌ చార్య, ప్రముఖ అంతర్జాతీయ జ్యోతిష్య పండితులు

మూడు నెలల ముందే బుక్‌



ఆగస్టులో ఉన్న పెళ్లిళ్లకు ఫంక్షన్‌ హాల్‌లు మూడు నెలల ముందే బుక్‌ అయ్యాయి. కొద్ది ముహూర్తాలే ఉండడంతో ముందు జాగ్రత్తగా చాలా మంది బుక్‌ చేసుకున్నారు. ఇంకా చాలా మందికి వస్తున్నారు. అన్ని ఫంక్షన్‌హాల్స్‌ ఎప్పుడో బుక్‌ అయ్యాయి. మూడు నెలలు ఖాళీగానే ఉన్నాయి. మళ్లీ రెండు నెలలు ఖాళీగానే ఉంటాయి.

– రజనీకాంత్‌రెడ్డి, ఫంక్షన్‌ హాల్‌ యజమాని

రెండు నెలలు ఇబ్బందే



కేవలం ఈ నెలలోనే పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. ఉన్న కొద్ది రోజుల్లో ఎక్కువ ఆర్డర్స్‌ వస్తున్నాయి. మాకు వీలైనన్ని పట్టుకున్నాం. ఈ నెలాఖరు నుంచి నవంబర్‌ 3 వరకు ముహూర్తాలు లేకపోవడంతో వివాహాలు, ఇతర శుభకార్యాలు ఉండవు. టెంట్‌ హౌస్‌లకు గిరాకీ ఉండదు. వీటిపై ఆధారపడ్డ మాకు ఇబ్బంది ఉంటుంది.

– బుచ్చిరెడ్డి, టెంటు హౌస్‌ నిర్వాహకుడు





అవార్డు అందుకుంటున్న సాక్షి ఫొటోగ్రాఫర్‌ శివప్రసాద్‌, అవార్డు వచ్చిన ఫొటో

మంత్రి చేతుల మీదుగా ఫొటోగ్రఫీ అవార్డు

సంగారెడ్డి జోన్‌: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో సంగారెడ్డి జిల్లా స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌ బి.శివ ప్రసాద్‌ చేయూత విభాగంలో సంగారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులకు వైద్య సిబ్బంది ఆడిస్తూ.. పాలు తాగిస్తున్న ఫొటోకు రెండో బహుమతి గెలుచుకున్నాడు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా నగదు పురస్కారం, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. కార్యక్రమంలో సమాచార శాఖ కమిషనర్‌ హనుమంత రావు, మీడియా అకాడమీ చైర్మన్‌ శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జోగిపేట బంద్‌

జోగిపేట(అందోల్‌): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసకు నిరసనగా మంగళవారం జోగిపేట బంద్‌ పాటిస్తున్నట్లు స్థానిక హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి. పొరుగు దేశాన హిందువుల పట్ల జరుగుతున్న హింసను ఖండిస్తూ జోగిపేటలో భారీ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు క్లాక్‌ టవర్‌ నుంచి 'సేవ్‌ హిందూస్‌ ఇన్‌ బంగ్లాదేశ్‌ 'పేరిట పురవీధులలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు, దుకాణాలు స్వచ్ఛందంగా బంద్‌ పాటించి, నిరసన ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చాయి.

బడికి పోయేదెట్లా?

- మూడేళ్లుగా పత్తాలేని ట్రాన్స్‌పోర్ట్‌ అలవెన్స్‌
- కాలినడకన పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు
- గతంలో నెలకు రూ.600 అందజేత
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,145 గుర్తింపు



పొలాల గట్ల వెంట పాపన్నపేట పాఠశాలకు వస్తున్న ముద్దాపూర్‌ విద్యార్థులు

పాపన్నపేట(మెదక్‌): పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరికి ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలకు శ్రీకారం చుట్టింది. బడి దూరం.. భారం కారాదన్న లక్ష్యంతో పొరుగూరి నుంచి వచ్చే ప్రతీ విద్యార్థికి ట్రాన్స్‌పోర్ట్‌ అలవెన్స్‌ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2020 వరకు ఈ అలవెన్స్‌లు వచ్చినా.. మూడేళ్లుగా పత్తాలేవు. ఉమ్మడి మెదక్‌ జిల్లాలో 3,145 మంది విద్యార్థులు ట్రాన్స్‌పోర్ట్‌ అలవెన్స్‌ కోసం ఎదురు చూస్తున్నారు. పొరుగూరు నుంచి బడికి వచ్చే విద్యార్థులకు జనరల్‌ ట్రాన్స్‌పోర్ట్‌ అలవెన్స్‌ ఇవ్వాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. ప్రైవేట్‌ వాహనాలు, ఆటోలు, ఇతర మార్గాల ద్వారా బడికి వచ్చేందుకు ఈ అలవెన్స్‌ మంజూరు చేసేవారు. 5వ తరగతి నుంచి 10 తరగతి చదివే విద్యార్థులకు కిలోమీటర్లు బట్టి ఈ అలవెన్స్‌ ఇవ్వాల్సి ఉంటుంది. వీరికి నెలకు రూ.600 అలవెన్స్‌ ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

మూడేళ్లుగా అలవెన్స్‌ లేవు

సంగారెడ్డి జిల్లాలో 1,297 పాఠశాలలుండగా 517 మంది, సిద్దిపేట జిల్లాలో 1,018 పాఠశాలలు ఉండగా 1,450 మంది, మెదక్‌లో 922 పాఠశాలలుండగా 1,148 మంది జనరల్‌ ట్రాన్స్‌ పోర్టేషన్‌కు అర్హులుగా గుర్తించారు. కానీ మూడేళ్లుగా వీరికి అలవెన్స్‌లు రావడం లేదు. బస్సులు లేక, ప్రైవేట్‌ ఆటోలు, వాహనాల్లో రాలేక చాలా మంది నిరుపేద విద్యార్థులు కాలినడకన వస్తున్నారు. వర్షాకాలంలో కొన్ని చోట్ల దారి మధ్యలో వాగులు వంకలు ఉండటంతో వారి బడి ప్రయాణం ప్రమాదకరంగా మారుతుంది.

వర్షం పడితే కష్టమే



మా సొంత గ్రామం ముద్దాపూర్‌. నేను పాపన్నపేట ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్నా. మాకు బస్సు సౌకర్యం లేదు. దీంతో 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు సుమారు 30 మంది కాలి నడకన వస్తాం. దారి మధ్యలో వాగు ఉంది. వర్షం పడితే వాగు పొంగుతుంది. అందుకే భయం అవుతుంది.

– భవాని, 8 వతరగతి,ముద్దాపూర్‌

ఆరు కిలోమీటర్లు నడుస్తాం



నేను 5వ తరగతి వరకు ముద్దాపూర్‌ బడిలో చదువుకున్నా. ప్రతి రోజూ 6 కిలోమీటర్ల దూరం నడిచి పాపన్నపేటకు రావాలంటే కాళ్లు నొప్పి పెడుతున్నాయి. ప్రభుత్వం అలవెన్స్‌ ఇస్తే, ఆటోలో వస్తాం.

– మనీ, 6వ తరగతి, ముద్దాపూర్‌

ప్రతిపాదనలు పంపాం

జనరల్‌ ట్రాన్స్‌పోర్ట్‌ అలవెన్స్‌ కోసం ప్రతిపాదనలు పంపాం. డబ్బులు రావాల్సి ఉంది. కొంత కాలంగా నిధులు రావడం లేదు. వస్తే విద్యార్థుల అకౌంట్‌లో వేస్తాం. వర్షాకాలం కావడంతో కాలినడకన వచ్చే విద్యార్థులు జాగ్రత్తగా రావాలి. టీచర్లు తగిన సూచనలు ఇవ్వాలి.

– రాధాకిషన్‌రావు, డీఈఓ, మెదక్‌

గిర్మాపూర్‌ కన్నీటి గోస



ఆర్డీఓ సమావేశాన్ని బహిష్కరించిన ఆర్‌ఆర్‌ఆర్‌ బాధితులు, రైతు సంఘాల నాయకులు

- ట్రిపుల్‌ఆర్‌కి బలవంతంగా భూముల సేకరణ
- పంటలు పండించే భూములు లాక్కుంటే బతికేది ఎలా?
- ఉద్యమబాట పట్టిన గిర్మాపూర్‌ రైతులు
- రైతు సంఘాల నాయకుల మద్దతు



కొండాపూర్‌(సంగారెడ్డి): ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఇంద్రమ్మ. ఈమెకు గిర్మాపూర్‌లో 31 గుంటల భూమి ఉంది. భర్త చనిపోవడంతో 10 ఏళ్ల కుమారుడితో ఉంటుంది. కుమారుడిని చదివించుకుంటూ వ్యవసాయం చేసుకుంటూ కాలాన్ని వెళ్లదీస్తుంది. రీజినల్‌ రింగ్‌ రోడ్డులో భాగంగా ఈమెకు సంబంధించి 31 గుంటల భూమి మొత్తం పోతుంది. ఉన్న భూమి ప్రభుత్వం తీసుకుంటే నా కుటుంబాన్ని ఏవిధంగా పోషించుకోవాలి, నేను ఎలా బతికేది అని.. మా భూమి ఎట్టి పరిస్థితిల్లోనూ వదులుకోమంటూ రోదిస్తుంది. ఇలా ఈమె ఒక్కరి పరిస్థితే కాదు.. ఆ గ్రామంలో సుమారు 60 మంది రైతుల భూమి మొత్తం పోవడంతో వారు కన్నీటి పర్యంతరమవుతూ సాక్షితో గోడు వెల్లబోసుకుంటున్నారు.

జాతీయ రహదారికి పక్కనే గిర్మాపూర్‌ గ్రామం ఉండటం ఆ గ్రామస్తుల పాలిట శాపంగా మారింది. రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారంతో భూముల ధరలు పెరిగినప్పటికీ ఉన్నత స్థితికి చేకుంటామనే రైతుల ఆశలు ఆవిరయ్యాయి. భూములకు ఎంత ధర పలికినా అమ్మకుండా సంవత్సరానికి రెండు పంటల వరిని పండిస్తూ ఇతర గ్రామాలకు ఉపాధి చూపిన నాటి గిర్మాపూర్‌ నేడు కన్నీటి గోసతో విలవిలలాడుతుంది. కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్‌ఆర్‌కు నిధులు విడుదల చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు శ్రీకారం చుట్టింది. చుట్టూ ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ కేవలం రైతులకు సంబంధించిన పంట పొలాల నుంచి ట్రిపుల్‌ఆర్‌ రహదారిని వేయడంపై ఆంతర్యమేమిటో చెప్పాలని గ్రామస్తులు డిమాండ్‌ చేస్తున్నారు. టిపుల్‌ఆర్‌ అలైన్‌మెంట్‌ మార్చాల్సిందే అని, చావడానికి అయినా సిద్ధమే కానీ భూములు ఇచ్చేది లేదని రైతులు ఖరాకండిగా చెబుతున్నారు.

నాడు.. పచ్చని పైరులతో

నియోజకవర్గంలోనే అతి పెద్ద చెరువు అయిన మల్కాపూర్‌ ఆయకట్టు కింద గ్రామానికి సంబంధించిన భూములు ఉండడంతో 10 గుంటల భూమి కలిగిన రైతు కూడా సంవత్సరానికి రెండు పంటలు పండిస్తూ సంతోషంగా జీవితాన్ని గడిపేవారు. చుట్టూ ఎక్కడ చూసినా పచ్చని పైరులతో ఆ గ్రామం అంతా కళకళాడేది. గ్రామంలో 200 కుటుంబాలకు గానూ 165 కుటుంబాలకు చెందిన భూములు ఉన్నాయి. 350 ఎకరాల భూమి ఉండగా, వీటిలో 125 ఎకరాల భూమి మాత్రం ఆయకట్టు కింద ఉండేది. ఈ 125 ఎకరాలు పూర్తిగా ట్రిపుల్‌ఆర్‌ పుణ్యమా అని ఒక ఎకరా తడి పొలం లేకుండా పోతుంది.

గుంట లేకుండా పోతుంది



మా అమ్మ పేరు మీద 20 గుంటల భూమి ఉంది. మేము ముగ్గురం అన్నాదమ్ముళ్లం. అందరం కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. అమ్మ పేరు మీద ఉన్న 20 గుంటల భూమి కూడా ట్రిపుల్‌ఆర్‌లో పోతుంది. మాకు భూమి అనేది లేదు. మా బతుకులు అధ్వానంగా తయారు కావడమే కాదు, మేము మూట ముళ్లే సర్దుకొని వలస పోవాల్సిన పరిస్థితి దాపురించింది.

– రవీందర్‌, బాధితుడు

ట్రిబుల్‌ఆర్‌ వద్దే వద్దు



నాకు 7 ఎకరాల భూమి ఉంది. ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పిల్లలను చదివేందుకు ఎన్ని కష్టాలు పడ్డా భూమి అమ్మకుండా కాపాడుకుంటూ వచ్చిన. సంవత్సరానికి రెండు పంటలు పండించి ఇతర గ్రామాల కూలీలకు అన్నం పెట్టిన. ఇప్పుడు మేమే పని కోసం ఇతర గ్రామాలకు వెళ్లాలిస వస్తోంది.

– ఆంజనేయులు

ఎక్కడికెళ్లి బతకాలి



నాకు సుమారు 65 ఏళ్లు. నా పేరు మీద 1–14 గుంటల భూమి ఉండేది. ట్రిపుల్‌ఆర్‌లో ఉన్న భూమి అంతా పోతుంది. కేవలం వ్యవసాయం మీదే ఆధారపడి బతుకుతున్నాం. కుమారుడు లేకపోవడంతో కుమార్తెను ఇంట్లోనే పెట్టుకున్నా. ఈ వయసులో ఏం పని చేయలేను. పొట్ట చేతపట్టుకొని ఏ గ్రామానికి వెళ్లాలి. ట్రిబుల్‌ఆర్‌ వల్ల మాకు వచ్చే ప్రయోజనం ఏంటో అర్థం కావడం లేదు.

– వెంకటయ్య

బాలలు.. కరాటే వీరులు

- మార్షల్‌ ఆర్ట్స్‌లో రాణిస్తున్న విద్యార్థినులు
- మెదక్‌ జిల్లా కేంద్రంలో వందలాది మంది శిక్షణ
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు



కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థినీలు

మెదక్‌ మున్సిపాలిటీ: ప్రస్తుత సమాజంలో విద్యార్థులు, మహిళలు స్వీయ రక్షణ పొందడానికి కరాటే (మార్షల్‌ ఆర్ట్స్‌) మనోధైర్యాన్ని పెంచుతుంది. దీంతో వారంతా యుద్ధ విద్యపై మక్కువ చూపుతున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలకు కరాటే నేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మగవారితో ధీటుగా ఆడపిల్లలను కరాటేలో తీర్చిదిద్దుతున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అమ్మాయిలపై జరుగుతున్న ఆకృత్యాలను తిప్పికొట్టేందుకు కరాటే వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది. మెదక్‌ జిల్లా కేంద్రంలో వందలాది మంది విద్యార్థినిలు కరాటేలో శిక్షణ పొందుతున్నారు. అలాగే గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ప్రభుత్వం 3 నెలల పాటు శిక్షణ ఇప్పిస్తుంది.

మంచి క్రమశిక్షణ అలవడుతుంది



ఎనిమిదేళ్లుగా కరాటే నేర్చుకుంటున్నాను. బ్లాక్‌ బెల్ట్‌ సాధించాను. కరాటే నేర్చుకోవడంతో ఫిట్నెస్‌ ఉంటుంది. మానసికంగా ఎంతో ధైర్యం లభిస్తుంది. ప్రతీ పనిలో కాన్ఫిడెన్స్‌ పెరుగుతోంది. మగ పిల్లలతో సమానంగా అన్ని ఆట పోటీల్లో పాల్గొనవచ్చు. ఇప్పటి వరకు ఒక గోల్డ్‌ మెడల్‌, ఒక బ్రాన్స్‌, 3 సిల్వర్‌ మెడల్స్‌తోపాటు జాతీయ స్థాయిలో చాంపియన్‌షిప్‌ సాధించాను.

– విధాత్రి, బ్లాక్‌ బెల్ట్‌, మెదక్‌

ఆడ పిల్లలకు తప్పనిసరి



నేటి సమాజంలో జరుగుతున్న దుష్పరిణామాలను ఎదుర్కొనేందుకు కరాటే ఎంతగానో దోహదపడుతుంది. ఆడపిల్ల ఒంటరిగా తిరగాలంటే ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతీ ఆడపిల్లకు కరాటే నేర్చుకోవాలి. కరాటేలో నేర్పించే సెల్ఫ్‌ డిఫెన్స్‌ ప్రోగ్రామ్‌తో ఆడపిల్లలు తమనే తాము రక్షించుకోవడమే కాకుండా ఇతరులను రక్షించగలుగుతారు.

– మంజుల, న్యాయవాది, మెదక్‌

భయం పోయింది



గతంలో ఇంట్లోంచి ఎక్కడికైన వెళ్లాలంటే భయంగా ఉండేది. కరాటే నేర్చుకోవడంతో ఆ భయం పోయింది. ఆత్మవిశ్వాసం, మనోధైర్యం, టైమ్‌ సెన్స్‌ పెరుగుతోంది. ప్రతీ ఆడపిల్ల కరాటే నేర్చుకోవాలి. స్కూల్‌ గేమ్స్‌లో ప్రభుత్వం కరాటే పోటీలను పెట్టింది. కరాటేతో స్పోర్ట్స్‌ కోటాలో విద్యా, ఉద్యోగావకాశంలో రిజర్వేషన్‌ లభిస్తుంది.

– అఖిల, కరాటే విద్యార్థి, మెదక్‌

ఆత్మస్థైర్యం పెరిగింది



కరాటే నేర్చుకోవడం కొత్త అనుభూతినిచ్చింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బాలికలు, యువతులు ఇలాంటి ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలి. ఎవరైనా దాడిచేస్తే ఎలా తిప్పి కొట్టాలి. తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలిసింది. కరాటేతో ఎంతో ఆత్మస్థైర్యం పెరిగింది.

– ఐశ్వర్య, కరాటే విద్యార్థి, మెదక్‌

చదువుతోపాటు కరాటే



ఆడపిల్లలపై జరుగుతున్న ఆరాచకాలను ఎదుర్కోవాలంటే కరాటే లాంటి మార్షల్‌ ఆర్ట్స్‌ ఎంతగానో దోహద పడుతుంది. ప్రస్తుత తరుణంలో ప్రతీ ఆడపిల్లకు చదువుతోపాటు కరాటే నేర్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కరాటే నేర్చుకోవడం వల్లన ఏకాగ్రత, శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం, సెల్ఫ్‌కాన్ఫడెన్స్‌ పెరుగుతుంది.

– నగేశ్‌, సీనియర్‌ కరాటే మాస్టర్‌